
# వికలాంగుడు

దోనేపూడి ప్రేమ్ దులారి



బలిష్ఠమైన శరీరం, మేలిమి బంగారుఛాయ, చక్కని ముక్కు తీరూ నిలువుటద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుని తనలోతనే మురిసిపోసాగాడు మాధవ్.

తెల్లటి గుడ్డల్లో తను మరింతగా తళతళలాడిపోతాడు అందుకే ఎప్పుడూ తెల్లగుడ్డలే ధరిస్తాడు అదే తన ప్రత్యేకత! తెల్లగుడ్డలమీద చిన్నమచ్చపడ్డా వాటిని వేసుకోడు!!

హఠాత్తుగా అతని చూపు దుస్తులమీద నుంచి జుట్టు మీదకి వెళ్ళింది. వెంటనే జేబులోంచి దువ్వెనతీసి మరోసారి దువ్వుకున్నాడు.

అతనలా దువ్వుకోవడానికి ఎదురుగా అద్దమే అక్కర్లేదు ఎదుటి వ్యక్తి కళ్ళద్దాలలో ప్రతిబింబం కనిపించినా, ఆఖరికి ఎదుటి వ్యక్తి కనుగుడ్లలో తన బింబం కనిపించినాసరే అలా అలవోగా జేబులోంచి దువ్వెనని తీసి చకాచకా తల దువ్వేసుకోగలడు!

అసలే కోతి! పైగా కల్లు తాగిందన్నట్లు... నడుస్తున్నా, నవ్వుతున్నా, నలుగురిలోవున్నా కూడా ఎడమచేతితో జుట్టును సవరించుకుంటూనో, కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూనో తన అందాన్ని ద్విగుణీకృతం చేసుకోవడానికి నానాతంటాలు పడే మాధవ్ ఎదురుగా అద్దంవుంటే తన అందానికి మెరుగులు దిద్దుకుంటూ మురిసిపోకుండా ఉండగలడా?

"నేనూ వస్తానండీ... ఏదైనా సినిమాకి వెళదాం..." వెనుక నుంచి మాట వినిపించడంతో పాటు ఎదురుగా అద్దంలో తన వెనుక కనిపించిన రాజ్యాన్ని చూసేసరికి ఒక్కసారి పాల పొంగు మీద నీళ్ళు చల్లినట్లు చప్పబడిపోయాడు మాధవ్.

"సినిమాలు, షికార్లకి నీకు తీరిక ఉండొచ్చు...

నాకు తీరికలేదు..." చటుక్కున వెనక్కి తిరిగిన భర్త కళ్ళలోని ఎఱ్ఱజీరల్ని చూసి చిన్నబుచ్చుకుంది రాజ్యం.

"మిమ్మల్నలా చూస్తుండేసరికి ముచ్చటేసి అలా అడిగాను..."

"రోజూ ఆఫీస్ కాగానే ఇంటికి వచ్చి స్నానం చేసి శుభ్రంగా తయారైకానీ ఎక్కడికీ వెళ్ళనవే విషయం నీకు తెల్సు... రోజూ ఇలాగే వెళ్తాను, ఆఫీసు పనికాగానే ఇతర పన్లకి. రోజూ నీకిలాగే ముచ్చటేస్తే నా జీతం నీ సినిమాలకి, షికార్లకే చాలదు!"

అసలే నల్లటి రాజ్యం ముఖం మరింత నల్లగా మాడిపోయింది.

అద్దంలో చూసుకున్న తన ముఖానికి, ఎదురుగా కనిపిస్తున్న భార్య ముఖానికి ఎంతతేడా! ఈమెకి, తనకి జోడీ ఏమిటి? అసలు తనీమెని ఎలా చేసుకున్నాడని తామిద్దర్నీ చూసిన ఎంతమందనుకోలేదు! ఈమెని వెంటేసుకుని బయటకు వెళ్ళగలడా తను?— మాధవ్ భృకుటి ముడిపడింది.

నల్లవాళ్ళలో కూడా నీలాంటి అందగత్తె ఉంటుందా!! అంటూ ఆనాడు తెగ ఆశ్చర్యపోయిన ఆ వ్యక్తే నా ఈ వ్యక్తి : ఇప్పుడు గతాన్ని గుర్తు తెచ్చుకుని, వర్తమానంతో పోల్చుకుని ఆశ్చర్యపడడం ఆమె వంతైంది.

తన అందానికి మురిసిపోయే ఆ అందగాడు తన భార్య అందంగా ఉంటే ఇతరుల కళ్ళు ఆమె మీద ఎక్కడ పడతాయోననే భయంతో అందవిహీనమైన ఆమెని ఏరికోరి చేసుకున్నానని చెప్పలేదుగా! అందుకే ఆ విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి తన అందవిహీనతని గుర్తించినట్లే ప్రవర్తించడానికి అతనాక్షణంలో ఏవేవో మాట్లాడి ఉంటాడని ఆమె ఊహించను కూడా ఊహించలేదు.

ఊహకి, నిజానికి మధ్య దూరమెంత? మాధవ్‌కి, రాజ్యానికి మధ్యవున్న దూరమంత!

ఆమె ఆలోచన్లని, హావభావాల్ని పట్టించుకోకుండా అతను ముందుకు నడిచాడు.

రోడ్డు కవతల ఎదురుగావున్న ఇంటి తలుపులు తీసున్నాయి.

"ఎదురింట్లోకి ఎవరో వచ్చినట్లున్నారే!" గుమ్మం దిగబోతున్నవాడలా ఒక్కక్షణం ఆగి జనాంతికంగా అన్నట్లు అన్నాడు.

"మధ్యాహ్నం సామానుతోసహా దిగారు— మొగుడు పెళ్ళాలు మాత్రమేననుకుంటాను. పిల్లలున్నట్లులేరు... "భర్త తనని పలకరించడమే బ్రహ్మాండమన్నట్లు తనకి తెలిసిన విషయాలన్నింటినీ ఏకరవు పెట్టసాగింది రాజ్యం.

"ఆమె ఎంత అందంగావుంది. అతడికి మాత్రం అవిటి కాళ్లట్లుంది... అతడిని చూడగానే నా మనస్సే చివిక్కుమంది. పాపం ఆ ఇల్లాలు అతడిని చేసుకోవడానికి ఎంతబాధపడి ఉంటుందో... బహుశా ఆమె తల్లిదండ్రులు ఏ కట్నం ఇవ్వలేకో ఆమె గొంతునలా కోసివుంటారు!"

ఏలేభరి : ఆ హీరో హాస్పిటల్‌లో ప్రమాదస్థితిలో కొట్టుమిట్టాడుతుంటే, అతను త్వరగా కోలుకోవాలని అందరికంటే మీరెక్కువగా ఆతృత పడుతున్నారు. ఆయనంటే మీకంత అభిమానమా?

నిర్మాత : అభిమానమా —పాడా! మేం తీస్తున్న సినిమాలో అతను హీరో. సగం సినిమా పైగా పూర్తయింది. ఇప్పుడతను టపాకట్టేస్తే ఇక నా నెత్తిమీద చెంగేసుకోవలసి వస్తుందేమోనని భయంతో...

—చలపాక ప్రకాష్
విజయవాడ

భార్య మాటలు మాధవ్‌కి చిరాకుని తెప్పించాయి. 'కట్నం ఇవ్వలేక ఆమె తల్లిదండ్రులు ఆమె గొంతుకోసారో లేదోగాని ఎక్కువ కట్నాన్ని ఆశ చూపించి నీ తల్లిదండ్రులు మాత్రం నా గొంతుకోసారు' గొంతులోని మాటల్ని గొంతులోనే నొక్కేశాడు. తనదగ్గర అందముంటే ఆమె దగ్గర డబ్బుంది అందుకే ఆమె తన జీవిత భాగస్వామిని కాగలిగింది. తన అలవాటు, సౌందర్యారాధన అలా కొనసాగాలంటే ఆమెకి కోపం రాకూడదు. అందుకే ఎంత కోపమొచ్చినా గరళకంఠుడిలా గొంతులోనే దిగమింగేసుకోవడం ఆమెని పెళ్ళి చూపుల్లో చూసినప్పటి నుంచే అలవాటు చేసుకున్నాడు.

ఇంట్లో అందమైన భార్యుంటే తనింత సౌందర్యారాధనని చెయ్యగలిగేవాడా? ఇంట్లోనే పడుండేవాడు. పైగా బయటివాళ్లు తన అందాన్నెక్కడ అస్వాదిస్తారోనని దిగులుపడిపోయేవాడు. ఇప్పుడే దిగులులేదు.

ఆలోచనల్తో మెట్లు దిగబోతున్నవాడల్లా ఎదురు గుమ్మంలో మెరిసిన మెరుపుకి షాక్ తిన్నాడు.

ఆమె...ఆమె... నీరజకదూ?

కదూ ఏమిటి తనమెహం... నీరజే! అందుకే తనని చూడగానే షాక్ కొట్టినట్లయి అలా లోపలికి వెళ్ళిపోయింది.

నీరజ...

తన అందానికి తనే విర్రవీగే నీరజ!

తను పెళ్ళి చేసుకొమ్మని అడిగితే ఛీత్కరించిన నీరజ...

ఆఖరికి ఓ అవిటివాణ్ణి పెళ్ళి చేసుకుందన్న మాట!

తనని పరాభవించినందుకు తగినశాస్తే జరిగింది.

తృప్తిగా తల పంకించుకుంటూ ముందుకు నడవసాగాడు మాధవ్...

ఇప్పుడేకాదు కాలేజ్‌లో చదువుకునేప్పుడు కూడా తనిలాగే ట్రిమ్‌గావుండేవాడు. తనతో మాట్లాడడానికే ఆడపిల్లలు వువ్విళ్ళూరేవారు.

కాలేజ్ మెయిన్‌గేటు దగ్గరున్న చెట్టుకింద తన బృందంతో కలసి నిలబడి వచ్చిపోయే ఆడపిల్లల్ని ఎంతగా ఏడిపించేవాడు! అయినా ఎవ్వరూ తనమీద ప్రిన్సిపాల్‌కి రిపోర్ట్ చెయ్యలేదు...పైగా తనలా టీజ్‌చెయ్యడంతో లోలోపలే సంతోషపడేవారు కూడా...! ఆ రోజుల నుంచే సౌందర్యారాధన తన హాబీ. ఆడగాలికి తపించిపోయేవాడు...

అలాంటి తను నీరజ అందానికి ముగ్ధుడయ్యాడు. ఈ ఒక్క అందం దొరికితే చాలు మరే అందం జోలికీ పోనుకూడా పోను అనుకున్నాడు. అప్పటినుంచే ఆమెను ఆరాధించసాగాడు.

ఆ ఆరాధన రోజురోజుకీ పెరగసాగింది. డిగ్రీ పరీక్షలు పూర్తికాగానే ఇక ఆమె తనకి దూరమైపోతుందని భయపడ్డాడు. దూరంకాకూడదని అలమటించిపోయాడు. ఆఖరికి ధైర్యాన్నంతటినీ కూడదీసుకుని "ఐలవ్ యూ" అన్నాడు ఆమెనెలాగో ఒంటరిగా పట్టుకుని.

తనంత ధైర్యాన్ని కూడదీసుకోవాల్సి వచ్చింది—ఆమెతో ఆ మాట చెప్పడానికి కాదు, ఆమె ఎక్కడ 'నో' అంటుందోననే భయం ఏ అంతరాంతరాలలోనో వుంది!

తను భయపడ్డంతా అయింది.

"బట్ ఐ హేట్ యు" అంది ఛీత్కరించుకున్నట్లు.

ఛెళ్ళున చెంపమీద చరచాలనిపించింది. కానీ ఆమె అప్పటికే అక్కడ నుంచీ వెళ్ళిపోయింది. తిరిగి ఇప్పుడు కనిపించింది. అంత అహంకారంతో కాదు, సగం చచ్చిపోయి!

ఆ భిక్కచచ్చిన మొహాన్ని అతిదగ్గర నుంచీ చూడాలి! అప్పుడుగాని తన మనోఫలకం మీదున్న ఆమె అహంభావరూపం చెరిగిపోదు...

అసంకల్పితంగా మాధవ్ కాళ్ళుముందుకు దారితీస్తున్నాయేగాని అతడి మనసు ఆమె చుట్టూనే తిరగసాగింది...

ఆమె అహంమీద దెబ్బనెప్పుడు, ఎలా తియ్యాలా అని ఆలోచించసాగింది.

రోజా తన కోసం ఎదురు చూస్తుంటుందని తెలుసు. అయినా ఈ రోజా రెక్కల్ని ఎలా విరవాలని ఆలోచించుకోవడానికి కాళ్ళు ఇందిరా పార్కులోకి దారితీశాయి.

ఇలా పార్కులకి తనెప్పుడైనా ఒంటరిగా వచ్చాడా? తన ఈ స్థితికి కారణం నీరజ... ఆమె శృంగభంగానికి ఓ చక్కటి పథకాన్ని రూపొందించాలి.

గులాబీ పార్కు ప్రక్క కెళ్ళి కూర్చున్నాడు.

దూరంగా పొన్నాగ చెట్టుకింద ఓ జంట... ఆమె ఒడిలో అతని తల... అతని జుట్టులో ఆమె కుడి చెయ్యివేళ్ళు... వాళ్ళు చచ్చినా భార్యాభర్తలైవుండరు! భార్యాభర్తలైవుంటే ఇంట్లో చాలకనా ఇలా పబ్లిక్ రొమాన్స్‌కి ఎగబడేది...!

నీరజతో తన రొమాన్స్ ఇలా పార్కులు పట్టకూడదు. నాలుగ్గోడల మధ్యే వుండాలి!

తననవసరంగా ఇంత ఆలోచిస్తున్నాడుగాని

ఆమె అహంకారం ఎప్పుడో అణగారిపోయి ఉంటుంది. అవిటివాడితో అంతటి అందం తృప్తి పడుతుందా? పడదుగాక పడదు... వెంటనే తను తృప్తిపరచడానికి ప్రయత్నించాలి. లేకపోతే అంతటి అందం అడవిగాసిన వెన్నెలే అవుతుంది!

రకరకాల ఆలోచనల మధ్య చీకటిపడింది. అతడి మనసు నిండా ఆమె అందమే వెలుగులు వెదజల్లసాగింది. ఆ అందం బ్రతుకు చీకటైపోయింది. వెలుగుని ప్రసాధించాలి. నెమ్మదిగా లేచి ఇంటివైపు బయల్దేరాడు.

అందరి మధ్యనుంచీ నడుస్తున్న అతని ఆలోచనలంతటినీ ఒకరే కమ్మేశారు.

తమసందు చేరుకోగానే కాళ్ళు హఠాత్తుగా ఆగిపోయాయి.

అక్కడే నిలుచుని సిగరెట్ వెలిగించాడు.

తమ ఇంటి తలుపులు వేసేవున్నాయి. ఆమె ఇంటి తలుపులు కొడుతుంటే ఎవ్వరూ చూడరు...

కానీ ఆకుంటాడు ఇంట్లోవుంటే? నువ్వెవరివన్నట్లు తనని చూస్తూ నీరజ ప్రక్కన నిల్చుంటే తను తట్టుకోగలడా?

లేదు....

ఆ అవిటివాడికి దగ్గరగా అంతటి అందాన్ని చూస్తే తన గుండెలు పగిలితీరతాయి.

తన గుండెలు పగలకపోయినా భర్తున్నప్పుడు వెళ్తే ఆమె తనతో ఎలా చనువుగా మసలుతుంది?

అందుకే ఆ అవిటివాడింట్లో వుండగా తను వెళ్ళకూడదు. వాడు లేనప్పుడు వెళ్తే ఆమె తన గుండెలమీద వాలిపోతుంది.

చేతిలోని సిగరెట్టు వేలిమీద కాలి చురుక్కుమనడంతో ఈలోకంలోకి వచ్చి ఆ సిగరెట్టుని పారేసి మరో సిగరెట్టుని వెలిగించాడు. ఇలా అందాల్ని మార్చడం తన అభిరుచి!

నీరజ ఇంటి తలుపులు తెరుచుకుని, గుమ్మంలోంచి కాంతి రోడ్డుమీద పడింది. ఓ వ్యక్తి కుంటుకుంటూ బయటికి వచ్చాడు. వెనుకే తలుపులు మూసుకున్నాయి.

'కుంటి వెధవా బయటికి ఫో...' అని ఆమె తోసివుంటుంది.

తన గర్వానికి పెనాల్టీ ఈ జన్మలోనే తీసుకుంది. పాపం! ఎంతగా కుంగిపోతోందో— వెంటనే వెళ్ళి ఆమెని ఒళ్ళోకి తీసుకుని ఊరడించాలనిపించింది మాధవ్‌కి.

తనకి తెలీకుండానే అడుగులు అటువైపు పడసాగాయి.

రెండడుగులు వేశాడోలేదో ఆ కుంటివాడు పక్కకొచ్చాడు.

ఈ సొట్టకాలు వాడు పక్కకొస్తేనే తను భరించలేకపోతున్నాడు. ఇతనిని పక్కలో కూడా ఎలా భరిస్తుందో పిచ్చి నీరజ.

అమాంతం ఆమె మీద జాలి పెరగడంతో

> "ఏమిటీ ఆ సుబ్బారావు లక్ష రూపాయలు పోయాయని ఏడుస్తున్నాడు. డబ్బులు పోతే పోలీస్ కంప్లయింట్ ఇవ్వొచ్చుగా."
>
> "డబ్బులేం పోలా. మగపిల్లవాడు పుడితే లక్ష కట్నం వచ్చేది. ఇప్పుడతనికి ఆడపిల్ల పుట్టిందట. మరి లక్ష రూపాయలు కట్నం కింద పోయినట్లేగా అని ఏడుస్తున్నాడు."
>
> —చలపాక

పాటు అవిటి భర్త మీద కోపం పెరిగింది!

వెనక్కి తిరిగి కొరకొరా ఆ చీకట్లో అతడిని చూస్తూనే గబాగబా ముందుకు నడవసాగాడు మాధవ్.

ఇంటికి చేరుకున్నాడు. ఆశ్చర్యం... ఆనందం...

తన ఇంటి కాలింగ్‌బెల్ నొక్కకుండా ఎదురింటి కాలింగ్‌బెల్ నొక్కుతున్నాడు. వికారానికి బదులు అందాన్ని చూడబోతున్నాడు. అవిటి లోకంలో అలమటించిపోతున్న అందాన్ని ఆదుకోబోతున్నాడు! ఎంతో థ్రిల్‌గా ఉంది.

కాలింగ్ బెల్ నొక్కాడు.

తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా నీరజ!

నవనవలాడే అందం అలాగే నవ్వుతూ ఎదురుచూస్తున్నట్లుంది.

ఒక్కసారి తనని చూడగానే తొట్రుపడింది. కానీ వెంటనే సర్దుకుంది.

"రండి..." ప్రక్కకి తొలగి దారి ఇచ్చింది.

ఈమెని తప్పకుండా తనదారిలోకి తెచ్చుకోగలడు—ధైర్యంగా లోపలికొచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

"ఎదురింట్లోనే వుంటున్నారనుకుంటాను..." కోయిలకూసింది. తనని చూసిందన్నమాట ఇందాక. అతడిలో ధైర్యం రెట్టింపైంది.

"అంతే కాదు నీ వ్యధనూ అర్థం చేసుకున్నాను" మాధవ్‌లో పైత్యం ప్రకోపించింది.

ఆమె అయోమయాన్ని ఎవరుచూస్తారోనని పడుతున్న కంగారుగా భ్రమించాడతను.

"మీ వాళ్ళు ఏ కట్నం ఇవ్వడానికో కక్కుర్తిపడి నీ గొంతు కోసివుంటారు... నిన్ను అక్కున చేర్చుకుని ఊరడించడానికి నేనున్నాను..." అతను కుర్చీలోంచి లేచాడు. ఆమె భయంతో రెండడుగులు వెనక్కివేసి, వెనుక గదిలోకి చేరింది.

అతడు విజృంభించాడు.

"రా! నీరజా! నీ మొగుడికే కాదు మూడో మనిషికి తెలీకుండా నీకు సర్వసుఖాల్ని అందిస్తాను. ఆ రోజు నన్ను పెళ్లి చేసుకోవడానికి నిరాకరించినా, ఈ రోజు నా ఇంటి ఎదురింటిలోకి అద్దెకి దిగి నీ తప్పుని దిద్దుకున్నావ్. నా నల్ల పెళ్ళాం, నీ కుంటి మొగుడు... జానేదేవ్..."

"ఆగు. ఒక్కడుగు ముందుకేసావో చేతిలో వున్న ఈ ఫవర్‌వాజ్‌ని నీ ముఖాన కొడతాను. ఆ ఫ్లవర్‌వాజ్‌లు టీపాయ్‌ల మీద అందంగా అలంకరించడానికే కాదు, నీలాంటి దుర్మార్గుల ముఖాలు పగలగొట్టడానికి తోడ్పడతాయ్... నువ్వు బయటికెంత అందంగా కనిపిస్తావో, నీ మనసంత మలినమని నాకేనాడో తెలుసు. అందుకే నువ్వెంత ప్రాథేయపడ్డా నిన్ను పెళ్ళి చేసుకోవడానికి వప్పుకోలేదు..."

"అందుకేనేమో ఈ అవిటివాడికి అర్థాంగివయ్యావ్..." మాధవ్ అంతకన్నా ఛీత్కారంగా అన్నాడు.

"ఆయన శారీరకంగా అవిటివాడు కావచ్చు. నువ్వు మానసికంగా అవిటివాడివి. అందుకే ఇలా కొంపలు కూల్చడానికి బయల్దేరావ్. ఆయన మానసికారోగ్యం ముందు ఈ శారీరక అవిటిదనం కనిపించదు... నిన్ను మళ్లీ చూసిన తర్వాత ఆయన మీద గౌరవం రెట్టింపైంది. మళ్ళీ ఎప్పుడూ మా ఇంటివైపు చూడడానికి ప్రయత్నించకు. వెళ్ళు..." నీరజ కాదు భద్రకాళి గర్జించింది.

కోపాన్ని బలవంతాన అణుచుకుంటూ వెనుదిరిగిన మాధవ్ గుమ్మంలో నిలుచున్న అవిటివాణ్ణి చూసి అదిరిపడ్డాడు.

అక్కడ నిల్చోలేక అతడిని తోసుకుంటూ తనింటివైపు వచ్చేశాడు.

తనవిటివాడని తన భార్య మనసులో ఎక్కడ దిగులుందోనని దిగులుపడుతున్న ఆ భర్త మనసు తేలికైంది. ఎన్నాళ్ళనుంచో బయటపడకుండా లోలోపలే దిగులుపడుతున్న భర్త తేలిక మనసుతో లోనికి అడుగుపెట్టగానే అతడిగుండెల మీద వాలిపోయింది నీరజ.

వెక్కి వెక్కి ఏడుస్తున్న ఆమెని అలాగే గుండెలకి హత్తుకుంటూ మౌనంతోనే ఓదార్చసాగాడతను.

సరిగ్గా అదే సమయంలో ఇంట్లో అద్దం ముందు నిల్చుని తన అందాన్ని మరోసారి తనివితీరా చూసుకున్నాడు మాధవ్.

తన బలిష్ఠమైన శరీరం ముందు ఆ అవిటివాడెంత? తన శరీర ఛాయముందు వాడు కారు నలుపు! తెల్లటిగుడ్డల్లో తను తళతళలాడిపోతుంటే ముదురురంగు దుస్తుల్లో మరింత ముదురుగా కనిపిస్తాడు వాడు!! జేబులోంచి దువ్వెనని తీసి దువ్వుకుని మరీ దుస్తుల్ని మార్చుకోవడంలో మునిగిపోయాడా మానసిక వికలాంగుడు.

★